



ఆ వాహనాలను

'తుక్కు కింద అమ్ముకోవచ్చు'..!

◆ బిఎస్-3 వాహనాలు బిఎస్-4 రిజిస్ట్రేషన్‌పై కోర్టు తీర్పు

◆ రెండు రోజుల్లో ఐదు వాహనాలు అమ్మకానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తప్పుడు పత్రాలతో బిఎస్-3 వాహనాలను బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసిన కేసులోని ఐదు వాహనాలను తుక్కు కింద అమ్మకానికి న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ వాహనాలను రెండు రోజుల్లో తక్కు కింద అమ్మకానికి రవాణ, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుక్కు కింద కొన్న వాహనాలను బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలపై గత కొంతకాలంగా రవాణా, పోలీసు శాఖ విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. ఇది జెసి.ప్రభాకర్‌రెడ్డి కుటుంబంతో లింకు ఉందన్న ప్రచారమూ సాగుతోంది. ఈ కేసులో మొత్తం 154 వాహనాలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో కొన్నింటిని సీజ్ చేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి విచారణ చేపట్టారన్న దానిపై పోలీసు విచారణ సైతం నడుస్తోంది. ఇది పురోగతిలోనున్న సమయంలోనే కొంత మంది బాధితులు తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. నేరుగా తాము పత్రాలను సృష్టించి వాహనాలు రిజిస్ట్రేషన్ చేయలేదని అంతక ముందు గోపాల్ అండ్‌కో సంస్థ చేసిందని న్యాయస్థానం ముందు వాదన పెట్టారు. ఇది తెలియక తాము కొనుగోలు చేసామని, పెద్దఎత్తున ఆర్థికంగా నష్టపోతున్నందున తమకు వాహనాలను ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఇందుకు అనుకూలంగా మొదట తీర్పునిచ్చింది. ఆ వాహనాలను వారికే ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు బిఎస్-3 వాహనాలు బయట తిరగడానికి అనుమతిలేదని కౌంటర్ దాఖలు చేశారు. దీంతో న్యాయస్థానం నేరుగా ఇవ్వడానికి అనుమతి నిరాకరించింది. దీంతో కనీసం తుక్కు కింద అయినా అమ్ముకునే అవకాశం కల్పిస్తే తమకు కొంత వరకైన నష్టం తగ్గుతుందని అభ్యర్థించడంతో అందుకు కోర్టు అంగీకరించి, తుక్కు కింద అమ్మకోవచ్చునని తీర్పునిచ్చింది. అయితే అప్పటికే వాహనాలను పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించామని రవాణా శాఖ అధికారులు కోర్టుకు తెలిపారు. అయితే ఇద్దరూ కలిపి పోలీసు, రవాణా శాఖ అధికారులు కలిపి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. రెండు మాసాల గడువును పెట్టింది. నేరుగా వాహనాలు ఇవ్వకుండా తుక్కుగా మార్చే ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు చేయాలని ఆదేశించింది. ఈ రికార్డు మొత్తాన్ని సీల్డ్ కవరులో న్యాయస్థానాన్ని అందజేయాలని కూడా ఆ తీర్పులో పేర్కొంది. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో విచారణకు అవసరమైన ఆధారాలను ముందుగానే విచారణాధికారి సేకరించి భద్రపరుచుకోవాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పు వచ్చి ఇప్పటికి రెండు మాసాలు పూర్తికావస్తున్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఐదు వాహనాల్లో ఒకటి అనంతపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉండగా, నాలుగు తాడిపత్రి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నాయి.

వైద్యుల్లేని ఆరోగ్య ఉపకేంద్రం..!

◆ జిల్లాలో 18 పోస్టులకు 10 ఖాళీ

◆ పట్టించుకోని ప్రభుత్వం

◆ రోగులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-హిందూపురం

అందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యం అంటూ పాలకులు నిత్యం మాటలు వల్లేవేస్తుంటారు. ఆచరణలో మాత్రం ఆ మేరకు శ్రద్ధ కన్పించడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. పేదల వైద్యం కోసం జిల్లా, ఏరియా అసుపత్రులతో పాటు పంచాయితీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, పట్టణ స్థాయిలో పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో నడుస్తున్నాయి. ఇలా శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా చూస్తే హిందూపురం పట్టణంలో ఇందిరానగర్, లక్ష్మీపురం, బోయపేట, ముదిరెడ్డిపల్లి, శ్రీనివాసనగర్‌లో కలిపి 5, ధర్మవరంలో 6, కదిరిలో 4, పుట్టపర్తిలో 1, పెనుకొండలో 1, మడకశిరలో 1 మొత్తం 18 పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఈ ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆధునాతన సౌకర్యాలతో కూడిన రక్తపరీక్ష పరికారాలు, హిందూపురం, ధర్మవరం, కదిరి ఆరోగ్య ఉప కేంద్రాల్లో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. రక్త పరీక్షలు నిర్వహించడానికి ల్యాబ్‌టెక్నీషియన్లు ఉన్నారు. అయితే స్కానింగ్ చేయడానికి అవసరమైన రెడియాలజిస్టు లేరు. వీరితో పాటు పూర్తి స్థాయిలో వైద్యులు కూడా లేరు. హిందూపురంలో 5 ఆరోగ్య ఉప కేంద్రాలకు ఒక్కరే వైద్యులు ఉన్నారు. కదిరిలో 4 ఆరోగ్య కేంద్రాలకు ఒక్కరు, ధర్మవరంలో 6 ఆరోగ్య కేంద్రాలకు నలుగురు, జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఉన్నది ఒక్కటే ఆరోగ్య కేంద్రం అయినా ఇక్కడ ఒక్క వైద్యుడూ లేరు.



ఇలా 18 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న 8 మంది వైద్యులపైనా కూడా పని ఒత్తిడి తీవ్రంగా ఉంటోంది. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో రోజుకు 50 నుంచి 70 మంది రోగులు చికిత్సల నిమిత్తం వస్తుంటారు. వైద్యులతో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డాటఎంట్రీ ఆపరేటర్లు పని చేస్తున్నారు. వైద్యులు లేక పోవడంతో వీరందరూ ప్రతి రోజు ఖాళీగా ఉంటున్నారు. వచ్చిన రోగులకు వారికి తోచిన వైద్యం చేసి, పంపుతున్నారు. డాక్టర్ అనుమతులు లేకుండా ఎలాంటి మందులూ ఇవ్వకుడదని నిబంధనలు ఉన్నప్పటికీ వేరే దారి లేక ఇలా వైద్యం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత... వేతనాల్లో వ్యత్యసాలే...

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో నడుస్తున్న పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బందికి ఉద్యోగ భద్రతతో పాటు వేతనాల్లో భారీగా తేడాలు ఉండడంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు వైద్యులు, సిబ్బంది ఇష్ట పడటం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్యులకు ఉద్యోగ భద్రతతో పాటు నెలకు సుమారు రూ.60 నుంచి రూ.70వేలు వేతనం ఉంటుంది. సిబ్బందికి సుమారు రూ.35 నుంచి రూ.40వేల వరకు వేతనాలు ఉంటాయి. ప్రభుత్వం సచివాలయాల్లో పని చేసే ఎఎన్ఎంకు నెలకు రూ.30వేలు ఇస్తున్నారు. అయితే ఎన్‌హెచ్‌ఎం కింద పని చేసే వారికి ఉద్యోగ భద్రత లేదు, వేతనాలు చూస్తే వైద్యులకు రూ.50 నుంచి రూ.55 వేలు, సిబ్బందికి రూ.18 నుంచి 20వేలు వేతనాలు ఇస్తున్నారు. వేతనాల్లో వ్యత్యసాలు, ఉద్యోగ భద్రత లేక పోవడంతో ఇక్కడ ఎవరూ పూర్తి స్థాయిలో పని చేసేందుకు సుముఖత చూపడం లేదు.

ప్రభుత్వం చొరవ చూపాలి

పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపితేనే అవి బలోపేతం అయ్యి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. నిబంధనల మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఎంపిక చేసిన సిబ్బందికి కేంద్రం ఇచ్చే వేతనానికి రాష్ట్ర ప్రభుత్వం వాట కలిపి వేతనాలు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో ఈ పద్ధతి అమలుకావడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత, వైద్య విధానపరిషత్, ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బందికి ఇచ్చే స్థాయిలో వేతనాలు ఇస్తే సిబ్బందితో పాటు వైద్యులు పూర్తి స్థాయిలో పని చేసి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించే వీలుటుందని పట్టణవాసులు తెలియజేస్తున్నారు.

నేటి నుంచి సత్యసాయి జయంతి ఉత్సవాలు

◆ ఏర్పాట్లపై అధికారులు, ట్రస్టు సభ్యుల ప్రత్యేక దృష్టి ◆ 22న డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి సత్యసాయిబాబా 97వ జయంతి ఉత్సవాలు శుక్రవారం నాడు వేణుగోపాల స్వామి రథోత్సవంతో ప్రారంభం కానున్నాయి. వేణుగోపాలస్వామి గుడి నుంచి గోపురం గేటు వరకు వేణుగోపాలుడు, సత్యసాయి చిత్రపటం, సీతారామ విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగిస్తారు. రథం ముందు వివిధ వేషధారణలతో కళాకారులు పాల్గొంటారు. ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దేశ విదేశీ భక్తులు ఇందులో పాల్గొననున్నారు. 19, 20న ప్రశాంతి నిలయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 41వ స్నాతకోత్యవం జరగనుంది. ఇందులో ఇస్రో ఛైర్మన్ పాల్గొంటారు. విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. 23న సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా స్వర్ణరథంలో సత్యసాయి చిత్రపటం ఊరేగింపు, సాయంత్రం జోల మహోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలకు పాల్గొనే వేలాదిమంది భక్తులు పర్యాటకులకు ఉచిత భోజన ప్రసాదాలు ఈనెల 23 వరకు పంపిణీ చేయనున్నారు. 23వ తేదీన కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యటన ఉంటుంది. వీరితో పాటు ప్రముఖులు, రాజకీయ నేతలు పుట్టపర్తికి రానున్నారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు, ట్రస్టు తగిన ఏర్పాట్లు చేపట్టింది.



ముస్తాబైన సత్యసాయి బాబా మహాసమాధి

ఇప్పటికే ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఉత్సవాలను జయప్రదం చేద్దాం : కలెక్టర్

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పుట్టపర్తిలో నిర్వహించే శ్రీ సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఆర్వో కొండయ్య, సంబంధం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యి ఈ నెల 23వ తేదీన నిర్వహించే బాబా 97వ జయంతి వేడుకల సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పుట్టపర్తి పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పుట్టపర్తిలో పారిశుధ్య కార్యక్రమాలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, అవసరమైతే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు, పర్యాటకుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. చిత్రావతి నది ప్రాంతంలో విద్యుత్ దీపాలంకరణ చేయాలన్నారు. పుట్టపర్తికి దగ్గరలోని పర్యాటక ప్రాంతాలను తెలియజేసే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి జి.నాగేశ్వర్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఇ.శర్వాన్, ఆర్టీసీ అధికారి టి.మధుసూదన్, పుడా వైస్ ఛైర్మన్ కె.నరేష్ కుమార్, ఆర్టీవో కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రహదారుల నిర్మాణ పనులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపడుతున్న వివిధ రహదారుల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ నుంచి మేదరమెట్ల వరకు (ఎకనామిక్ కారిడార్) నిర్మిస్తున్న రోడ్డుకు సంబంధించి పనులను జాయింట్ కలెక్టర్ చేతన్‌తో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా పుట్టపర్తి మండలంలోని గంగిరెడ్డిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలించి ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారుల అభివద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సకాలంలో ఆయా రహదారుల పనులను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కదిరి బైపాస్ రోడ్డును ఆయన పరిశీలించారు. బైపాస్ రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేసేందుకు వేగవంతంగా పనులను చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులను ఆదేశించారు. తదనంతరం బత్రేపల్లి క్రాస్ నుంచి కోలేకనుమ (గండి) రోడ్డును పరిశీలించి నాణ్యత విషయమై ఆరా తీశారు. రహదారి పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులను ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారు. అంతకుముందు పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామ రెవెన్యూ పరిధిలో గల ఆర్‌ఒబి భూములను పరిశీలించారు. భూములకు సంబంధించి పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యలక్ష్మి, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, జిల్లా ఇంజినీరు సంజీవయ్య, నేషనల్ హైవే ఎస్ఈ మురళీమోహన్, నేషనల్ హైవే అధికారులు, కియా ప్రతినిధులు పాల్గొన్నారు.




పుట్టపర్తి మండలంలోని గంగిరెడ్డిపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజా పునాది విస్తరణకు పటిష్ట నిర్మాణం

సిపిఎం శిక్షణ తరగతుల్లో రాష్ట్ర నాయకులు సిద్ధయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజల్లోకి సిపిఎంను తీసుకెళ్లి పటిష్టంగా పునాది నిర్మించడానికి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు, టీచర్ సిద్దయ్య పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తిలోని సిపిఎం కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా సిపిఎం నాయకులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ సమాజ స్థాపన కోసం కొత్త వ్యక్తులు కమ్యూనిస్టు భావాలను ఆకర్షించే విధంగా చూడాలన్నారు.కొత్త వ్యక్తులను పార్టీలోకి ఆహ్వానించి వారి ద్వారా ప్రజాక్షేత్రంలో సమస్యలను నివృత్తి చేసి పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. ఫలితంగా చాలామంది పార్టీ సానుభూతిపరులుగా మారే అవకాశం ఉంటుందన్నారు. దానికోసం గ్రామ, మండల స్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, సిపిఎం నాయకులు రామకృష్ణ, హరి, జంగాలపల్లి పెద్దన్న, వినోద్, ప్రవీణ్, సాంబయ్య, గౌస్ లాజిమ్, గంగాద్రి, బాబావలి పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సిద్దయ్య

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఎపి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ సరఫరా, ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని హిందూపురం డివిజన్ ఇఇ కార్యాలయంలో డివిజన్ వ్యాప్తంగా ఇంజినీర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం డివిజన్‌వ్యాప్తంగా విద్యుత్ కనెక్షన్లు 209 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని త్వరలో అందిస్తామన్నారు. సంస్థ అభివృద్ధి చెందాలంటే ఆర్థికంగా బాగుండాలన్నారు. అయితే ఎపి ఎస్‌పిడిసిఎల్‌కు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.6వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. హిందూపురం డివిజన్‌కు సంబంధించి రూ.2.20 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఇటీవల విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లావ్యాప్తంగా 20 కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హిందూపురం డివిజన్ పరిధిలో లో ఓల్టేజ్ నివారించేందుకు లేపాక్షి మండలం కల్లూరు, సోమందేపల్లి మండలం బి.చర్లోపల్లి, ఆగళి మండలం రామనహళ్లి, గుడిబండ మండలం రాళ్లపల్లి, హిందూపురం పారిశ్రామికవాడలో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొంచించామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పోలీస్, రెవెన్యూ, అంగన్వాడీ, అనుపత్రి తదితర సంస్థల నుంచి బిల్లులు రావాల్సి ఉందన్నారు. వ్యవసాయ బిల్లులు నెలకు రూ.80 మాత్రమే కట్టాల్సి ఉందన్నారు. వ్యవసాయానికి సంబందించి రూ.52 లక్షలు బిల్లులు జరిమానా ఉన్నాయన్నారు. వర్షాల కారణంగా ఏపుగా పెరిగిన చె చెట్లు పెరిగాయని వాటిని తొలగిస్తే తప్పా సరఫరాలో అంతరాయం ఉండదన్నారు. వాటిని తొలగించే సమయంలో చిన్నచిన్న సమస్యలు వస్తాయన్నారు. దీంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. దానికి ప్రజలు సహకరించాలన్నారు. దీంతో పాటు వినొయోగదారులు 1912 కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ భూపతి, ఎడిలు, ఎఇలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

అనర్హుల జాబితాను తొలగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన (పిఎంఎవై) పథకంలో అనర్హుల జాబితాను వెంటనే పూర్తిస్థాయిలో తొలగించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ పీడీ, డిఇలు, ఎఇ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎవై జాబితాలో శుక్రవారంలోపు అనర్హుల పేరు జాబితాలో తొలగించాలని ఆదేశించారు. జిల్లాకు నూతనంగా 19,870 ఇల్లు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించి లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ నాగరాజు, డిఇలు పాల్గొన్నారు.

సీమలో అడుగు పెట్టే నైతిక హక్కు చంద్రబాబుకు లేదు..


ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

అధికారంలో ఉన్న సమయంలో రాయలసీమను పూర్తిగా విస్మరించి, అధికారంలో లేని సమయంలో అభివృద్ధికి అడ్డు తగులుతున్న చంద్రబాబుకు సీమలో అడుగుపెట్టే హక్కు లేదని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మండిపడ్డారు. గురువారం పట్టణంలోని నివాసంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో న్యాయ రాజధాని పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే అడ్డుపడుతున్న చంద్రబాబు ఏ మొహం పెట్టుకుని కర్నూలు జిల్లాలో అడుగు పెట్టాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ద్రోహాన్ని, కుట్రలను రాయలసీమ ప్రజలు తిప్పి కొడతారన్నారు. ప్రజలు ఎడాపెడా మిమ్మల్ని బాదితేనే ప్రతిపక్షంలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు అధికారంలో ఉండి, రాయలసీమ జిల్లాలకు ఏ ఒక్క ప్రాజెక్టు తీసుకురాని చంద్రబాబు ఇప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సిఎం జగన్ పరిపాలనా వికేంద్రీకరణతో కర్నూలును న్యాయ రాజధాని చేస్తారన్నారు. విద్యార్థులు, యువజనులు, మేధావులు, రైతులు, కార్మికులంతా ముక్తకంఠంతో గోబ్యాక్.. చంద్రబాబు అని నినదిస్తుంటే సిగ్గులేకుండా పర్యటిస్తున్నాడన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినట్టు, నీ దత్తపుత్రుడి బాటలో నడుస్తూ తాను కూడా ప్రశ్నిస్తాను అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రజలకు ఏమీ చేయని నీవు విద్యను నారాయణ, చైతన్య విద్యాసంస్థలకు, వైద్యాన్ని మెడాల్‌కు రాసి ఇచ్చి తీరని అన్యాయం చేశావని మండిపడ్డారు. జగన్ సిఎం అయ్యాక నాడు-నేడు కార్యక్రమం ద్వారా, విద్య-వైద్యరంగాన్ని ప్రక్షాళన చేస్తూ కార్పొరేట్‌కు దీటుగా పేదలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివి

దివంగత నేత చౌళూరు రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ షేక్‌మహమ్మద్ ఇక్బాల్ కొనియాడారు. ఇటీవల దారుణహత్యకు గూరైన చౌళూరు రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి లేని లోటు ఎవరూ తీర్చలేరన్నారు. ఆయన హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఇప్పటికే పోలీస్ శాఖకు కోరినట్లు వివరించారు. చట్టం ఎవరి చుట్టం కాదని, హత్యకు కారకులైన వారు ఎంతటి వారనైన తప్పించుకోరన్నారు. రామకృష్ణారెడ్డి కుటుంబానికి పెద్దకుమారుడిలా అండగా ఉంటానన్నారు.



రామకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, వైసిపి నేతలు



సజ్జలకు విన్నవిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి

సజ్జలను కలిసిన మలేరియా సబ్ యూనిట్ అధికారి

మడకశిర రూరల్ : ఏపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం విజయవాడలో కలిశారు. ఈమేరకు వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, బకాయి డిఎలను విడుదల చేయాలని, 12వ పిఆర్‌సిని ప్రకటించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారుడు చంద్రశేఖర్‌రెడ్డిని విడివిడిగా కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

19న ద్విచక్ర వాహనాల వేలం

గోరంట్ల : ఎస్సీ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 19న దాదాపు 35 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సిఐ సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు.

కనగానపల్లి : మండలంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 19న వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

ఆధార్ మొబైల్ క్యాంప్

మడకశిర : మండల పరిధిలోని సి.కొడిగేపల్లి గ్రామంలో ఐదురోజులపాటు ఆధార్ మొబైల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు ఐదు రోజులపాటు ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న కార్తీక తెప్పోత్సవం

మడకశిర : పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వరి ఆలయంలో ఈనెల 21న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఆది, సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి కార్తీక సోమవారం సందర్భంగా ఉదయం నుంచి అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి ప్రాకారోత్సవం, కార్తీక దీపారాధన చేయనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం ముందు భాగంలో వెలసిన కోనేరులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి బాధాకరం

బుక్కపట్నం : గోరంట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేశన్న సతీమణి విజయలక్ష్మి అనారోగ్య కారణంతో మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. నియోజవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కషి చేసిన కేశన్న సతీమణి మృతిచెందడం విచారకరమని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టి-20 క్రికెట్ పోటీల్లో కదిరి జట్టు విజయం


కదిరి టౌన్ : గోవా రాష్ట్రం మడ్గావ్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ క్రికెట్ ఛాంపియన్‌షిప్ టి-20 క్రికెట్ పోటీల్లో కదిరి జట్టు విజేతగా నిలిచినట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఈనెల 13 నుంచి 16వతేదీ వరకు జరిగిన పోటీల్లో కదిరి జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌లూ గెలిచి ఛాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. బుధవారం జరిగిన ఫైనల్‌లో కదిరి క్రీడాకారుడు సాయి ప్రణీత్ 61 పరుగులతోపాటు 5 వికెట్లు తీసి ఆల్‌రౌండర్ ప్రదర్శన చేసినట్లు తెలిపారు.

గర్భిణులకు అన్నదానం

గోరంట్ల : పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాచన్న పల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవాకర్త కమలాకర్ గర్భిణులకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి పావని మాట్లాడుతూ గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నాసా కిట్లు పంపిణీ

గోరంట్ల : పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి విద్యార్థులకు గురువారం నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో నైపుణ్యమైన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగరాజ్, అకాడమిక్ కోఆర్డినేట్ తిరుమలేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ ఇర్షాద్, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.



నాసా కిట్లతో విద్యార్థులు

బలహీన వర్గాల నాయకుడు అంబేద్కర్

ప్రజాశక్తి-బత్తలపల్లి

కేవలం మాల, మాదిగలకు మాత్రమే అంబేద్కర్ నాయకుడు కాదని, బడుగు బలహీన వర్గాలందరికీ నాయకుడే అని పలువురు అధికారులు, నాయకులు అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో ఎస్సీ జనసంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం రాసింది మాల, మాదిగల కోసం కాదని ప్రజలందరి కోసమన్నారు. ఆయనను కేవలం కులానికి అంటగట్టకుండా భారతదేశానికే నాయకుడన్నారు. అనంతరం వేదమంత్రాలతో భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరీదేవి, బత్తలపల్లి, పోతుకుంట ఎస్ఐలు టీవీ శ్రీహర్ష, ప్రదీప్, సర్పంచు కుంటాలదేవి, బత్తలపల్లి ఎంపిటిసి కోటి నరేష్‌కుమార్, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, విఆర్. గోవిందరాజులు, ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సాకే కుళ్లాయప్ప, అధికార ప్రతినిధి మేకల రమేష్, ధర్మవరం డివిజన్ అధ్యక్షులు మాల్యవంతం రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి సారే వాల, బత్తలపల్లి మండల ప్రధాన కార్యదర్శి పసులూరి నల్లప్ప, గుమ్మలకుంట కృష్ణ, ఎపిఎంఆర్‌ఎస్ కేరగాళ్ల వెంకటేష్. శ్రీనివాసులు, ఎస్సీ జనసంఘం రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ ప్రసిడెంట్ కేసగాళ్ల ప్రదీప్, రణ్యణ్, సారే పెద్దన్న, మారుతి, రాము చిన్న, నాగరాజు అంబేద్కర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న తహశీల్దార్ యుగేశ్వరీదేవి

గ్రంథాలయ వారోత్సవాలు

తాడిమర్రి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో స్థానిక జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జగన్‌మోహన్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అలాగే విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ బందం, గ్రంథాలయ అధికారి డి.శీనానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడిమర్రిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుక్కపట్నం : నేటితరం విద్యార్థులు పుస్తక పఠనభ్యాస్యాన్ని అలవాటు చేసుకుని ముందుకు సాగాలని విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపల్ మునయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహులు రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, కోదాడ నారాయణరావు చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్‌ప్రసాద్, అధ్యాపకులు ఆదినారాయణ, దస్తగిరి, చంద్రమోహన్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక డైట్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి సమ్మేళనం వంటి కార్యక్రమాన్ని నిర్వహించి తెలుగు రచయితలను సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. తెలుగు కవి అస్లాం మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో ప్రావీణ్యత కలిగిందన్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.జయరాం, సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, శ్రీనివాస్‌ప్రసాద్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-చిలమత్తూరు

చాలారోజుల తర్వాత నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు స్థానిక నాయకులు గురువారం బాగేపల్లి టోల్‌గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జడ్పిటిసి అనూష, సర్పంచి సంధ్య, వైసిపి నాయకులు నాగరాజుయాదవ్‌తోపాటు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బాగేపల్లి టోల్ గేట్ వద్ద స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

రోడ్లు వేయాలని వినతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలో గ్రామాలకు తారురోడ్లు వేయాలని ఎంపిపి పురుషోత్తమరెడ్డి ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీకి విన్నవించారు. ఈమేరకు గురువారం కొడికొండ చెక్‌పోస్టులోని జిఎంఆర్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాలకు ఇప్పటికీ తారు రోడ్లు లేవన్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం మీరైనా స్పందించి రోడ్లు వేయాలని కోరారు.



రోడ్లు వేయాలని ఆర్‌అండ్‌బి ప్రిన్సిపాల్ సెక్రటరికి ఎంపిపి పురుషోత్తమరెడ్డి



నారా లోకేష్‌తో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

పెనుకొండ : ప్రభుత్వ వైఫల్యాలను తీసుకెళ్లాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చినట్లు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బి.పార్థసారధి ఆధ్వర్యంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో నారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ సమస్యలు, తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ చేసిన కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. ఇందుకు నారా లోకేష్ స్పందిస్తూ రాబోయే కాలంలో చేయాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హరీష్, పార్థుయాదవ్, సాయికిరణ్, షబ్బీర్ బాషా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలలహక్కుల వారోత్సవాలు

కదిరిటౌన్ : పట్టణంలోని రాణిపేట ఎంపియుపి పాఠశాలలో కదిరి రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకి పిల్లలంటే చాలా ఇష్టం అన్నారు. కావున ఆయన జయంతిరోజున బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రో చెల్డ్ గ్రూపు, చైల్డ్ రైట్స్ అడ్వాకసి ఫౌండేషన్ క్రాఫ్ వారు తయారు చేసిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్ధన, రెడ్స్ కోఆర్డినేటర్ యల్లప్ప, సిబ్బంది శారద, మెహతాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రొద్దం విద్యార్థి ఎంపిక

రొద్దం : రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు రొద్దం పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజ, పీడీ శాంతలింగం తెలపారు. గురువారం చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ క్రీడా పోటీల్లో రొద్దం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి లోకనాథ్‌రెడ్డి అండర్ 14విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలపారు. ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులుతోపాటు సీనియర్ ఉపాధ్యాయులు ఈశ్వరయ్య అభినందించారు.

- ప్రజాశక్తి వార్తకు స్పందన -

విత్తన వేరుశనగ కాయల పరిశీలన

నంబులపూలకుంట : మండల కేంద్రానికి వచ్చిన విత్తన వేరుశన కాయలను ఎపి సీడ్స్ వారు గురువారం పరిశీలించారు. ఏపీ సీడ్స్ ద్వారా రైతు భరోసా కేంద్రానికి వచ్చిన వేరుశనగ కాయలు పురుగు పట్టిన విషయాన్ని ప్రజాశక్తిలో వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎపి సీడ్స్ అధికారులు స్థానిక రైతు భరోసా కేంద్రానికి చేరుకుని వేరుశెనకాల బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందించే విత్తన వేరుశనగ కాయల నాణ్యతలో రాజీ పడేది లేదన్నారు. మేలు రకమైన విత్తనకాయలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

అమడగూరు : మండలంలోని తుమ్మల, ఏటుగడ్డ తండా, గోపాల్‌నాయక్ తాండా, కంచర వాండ్లపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఎంఇఒ జాన్ రెడ్డప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం, హాజరు పట్టిక, రోజువారి మెనూ, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 గంటల కల్లా బయోమెట్రిక్ వేయాలన్నారు. అలాగే మండలంలోని రెండవ విడత నాడునేడు కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యువతోపాటు ఉపాధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి టి.జగన్మోహన్ అధ్యక్షతన ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్య, సంక్షేమం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, జెడ్పిటిసి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు, మండల కోఆప్షన్ సభ్యుడు, ఎంపిటిసిలు, సర్పంచులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం ఆర్టీసీ డీఎం నోటి దురుసుతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ ఛైర్మన్ ముత్యాలప్ప ఆరోపించారు. ఈమేరకు ధర్మవరం ఆర్టీసీ డిపోలో గురువారం డీఎం ఛాంబర్ వద్ద ఎన్ఎంయుఎ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఓటీలు, డ్యూటీలు ఇవ్వకుండా ఉద్యోగస్థులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా తన నోటికి వచ్చినట్లు ఇష్టానుసారంగా మాట్లాడుతూ బస్టాండ్ పాయింట్లో కూర్చుని ప్రయాణికుల ముందు ఉద్యోగస్తులను అవమానపరుస్తున్నారని వాపోయారు. ఆఫీస్ క్లర్క్, దుర్గాప్రసాద్ డీఎంకు ఆఫీస్ పనికోసం ఫోన్ చేస్తే ఎవడ్రా నువ్వు నన్ను డిస్టర్బ్ చేస్తున్నావ్ అంటూ నానా దుర్భాషలాడారని తెలిపారు. బస్టాండ్‌లోనే బహిరంగంగా ఉద్యోగస్థులను ఇష్టానుసారంగా తిడుతూ అవమాన పరుస్తున్న డిఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎన్ఎంయుఎ నాయకులు, ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగస్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో నాయకులు

ప్రజాశక్తి-పరిగి

మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమి నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు అందుతున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సిఎం జగన్ నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు. తద్వారా ప్రతి ఇంటికి సంక్షేమం అందుతోందన్నారు. అనంతరం సేవా మందిరం అంధుల పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని హెచ్ఎం కరీం, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, మండల కన్వీనర్, ఎంపిపి, జెడ్పిటిసి, సర్పంచి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి ముఖ్యనాయకులు, అనుబంధ సంఘం నాయకులు, డీలర్లు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళినీ రంగేగౌడ్, సింగిల్‌విండో అధ్యక్షులు బాగాల చిక్కన్న, జడ్పిటిసి స్వరక్క నరసింహమూర్తి, ఎంపిటిసి లలితమ్మ, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, వక్కలిగా కార్పొరేషన్ డైరెక్టర్ త్రిలోక్నాథ్, సిద్దేశ్వరప్ప, టైలర్ కెంచప్ప, వైసిపి సీనియర్ నాయకులు గడ్డం రాజు, సర్పంచి తిప్పేస్వామి, రామచంద్రప్ప, మూర్తి, నాయకులు వలస సర్పంచి ఇతేంద్ర, దాసేగౌడు, ఉదుగూరు తిప్పేస్వామి, పేలుబండ ప్రసాద్, పుల్లికుంట మంజునాథ, డీలర్ శివకుమార్,

కదిరిటౌన్ : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డు శివాలయం వీధి, శివాలయం స్ట్రీట్‌లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలుసమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కొమ్ము గంగాదేవి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఎండి ఇస్మాయిల్, కౌన్సిలర్లు ఇస్మాయిల్, రాజశేఖర్ ఆచారి, కృపాకర్‌రెడ్డి, మురళీ, రంగారెడ్డి, షబ్బీర్, కళ్యాణ్, పిచ్చిలి శంకర్, రాంప్రసాద్, ఎంఎన్ ఫయాజ్, మహమ్మద్, ఆవుల స్వామి, నౌషాద్, దాదా పీర్, ఓం ప్రకాష్, ఎస్‌కె.వలి, షాను, ఇలాహి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్ నారాయణ

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని జీఆర్‌పి పోలీసులు తెలిపారు.

బస్సు బోల్తా.. మహిళా కార్మికులకు గాయాలు

పరిగి : మండలం వన్నంపల్లి శివారుల్లో కర్ణాటక సరిహద్దులో మహిళా కార్మికులు వెళ్తున్న కిమల్ పరిశ్రమ బస్సు గురువారం బోల్తా పడింది. దీంతో పలువురు మహిళలు గాయపడ్డారు. వివరాల్లోకెళితే హిందూపురం మండలం చిన్నగుడ్డంపల్లి వద్ద ఉన్న కిమల్ పరిశ్రమకు చెందిన బస్సు కర్ణాటక ప్రాంతానికి చెందిన మహిళా కార్మికులను తీసుకెళ్తుండగా బోల్తా పడింది. దీంతో పలువురు మహిళలు గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మహిళలను పరామర్శించేందుకు వెళ్లగా అప్పటికే వైద్యం చేయించిన యాజమాన్యం ఇళ్లకు పంపినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

కనగానపల్లి : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆందజనేయులు తెలిపారు. మండలంలోని మద్దెలచెరువు-భానుకోట మధ్యలో తనిఖీలు చేస్తుండగా తిప్పేపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల శ్రీనివాసులు సుమారు 48 ప్యాకెట్లు కర్నాటక నుంచి తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కురుబల బహిరంగ సభను జయప్రదం చేయండి

బుక్కపట్నం : పుట్టపర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న కురుబల ఐక్యత బహిరంగ సభను జయప్రదం చేయాలని కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ, తలమర్ల కమ్మన్న పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మండల పరిధిలోని జానకంపల్లి గ్రామంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిధిలోని కురుబలు బహిరంగ సభలో పాల్గొని సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు ఆదినారాయణ, కిష్టప్ప, పవన్‌కుమార్, విజయరంగ, శంకర, రమేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

గాండ్లపెంట : మండల పరిధిలోని గోడి వెలగల పంచాయతీలో నీరుకుంట్లపల్లి చెందిన పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి టి.జగన్‌మోహన్ కుటుంబానికి గురువారం వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేశారు. ఈమేరకు మృతురాలి భర్త సుబ్బారెడ్డికి రూ.10వేలు అందజేసి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి బాషా, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, లక్కసంద్రం సర్పంచి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు తనిఖీ

అగళి : మండలంలోని రావుడి పంచాయతీలో వికలాంగుల పెన్షన్లను ఎంపిడిఒ శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఎంతమంది వికలాంగులు ఉన్నారు.. ఎంత మందికి రూ.3వేలు వస్తోంది అన్న విషయాలపై విచారించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెహమాన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ

అమరాపురం : మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరాపురం మండలానికి నలువైపులా కర్ణాటక రాష్ట్రం వ్యాపించి ఉండడంతో అక్రమంగా మద్యం, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. వీటికి ఎవరు పాల్పడినాఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, జమేదార్ వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను భారంగా భావించొద్దు..

ధర్మవరం టౌన్ : ఆడపిల్ల పుట్టిందనో, కుటుంబ కలహాలతోనే పుట్టిన ఆడబిడ్డలను చెత్తకుప్పలు, ముళ్లకంపల్లోకి పారవేయకూడదని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయల కార్యక్రమాన్ని సిడిపిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఊయాల కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నజీర్, శ్రావణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, హెడ్ నర్స్ పూర్ణచంద్ర, సరళాకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లలితాకిరణ్, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

కొత్తచెరువు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై కళాబృందం గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గృహ రుణాలు, వాహన, ఎడ్యుకేషన్, ప్రభుత్వ సబ్సిడీ రుణాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుభాషిణి, ఫీల్డ్ ఆఫీసర్ పవన్‌కుమార్, రాంబాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మడకశిర రూరల్ : పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒ భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనం పెట్టాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

నాడు-నేడు పనులకు భూమిపూజ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో రూ.68 లక్షలతో నాడు-నేడు పనులకు గురువారం భూమిపూజ చేశారు. రూ.26లక్షలతో రెండు తరగతి గదులు, రూ.42 లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మండల అధ్యక్షులు ఎవి రమణారెడ్డి, వైస్ ఎంపిపి రంగన్న, సర్పంచి కామాక్షమ్మ, ఎంపిటిసి కుళ్లాయప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శోభారాణి, మండల సమైక్య అధ్యక్షురాలు కన్యాకుమారి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి తహశీల్దార్‌గా కరణం నవీన్‌కుమార్

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల నూతన తహశీల్దార్‌గా కరణం నవీన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కదిరి రెవెన్యూ కార్యాలయంలో సిఎస్‌డిటిగా పని చేస్తూ పదోన్నతిపై పుట్టపర్తి తహశీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ భాస్కర్‌నారాయణ భూరికార్డుల్లో అవకతవకల కేసులో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నల్లమాడ తహశీల్దార్ ఇన్‌ఛార్జిగా కొద్దిరోజులు విధులు నిర్వహించారు. ఎట్టకేలకూ జిల్లా అధికారులు నూతన తహశీల్దార్‌ను నియమించడంతో కరణం నవీన్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అలాగే తన పరిధిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరించే విధంగా పనిచేస్తానన్నారు.